క్లుప్తంగా

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

టెక్కలి: పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ డీఈఈ జి.శంకరరావు కోరారు. టెక్కలి గ్రామ సచివాలయం-4 పరిధిలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందజేస్తున్న సోలార్ రూఫ్ టాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు విద్యుత్ శాఖాధికారులను సంప్రదించాలని సూచించారు. డీఈ సీహెచ్ కృష్ణమూర్తి, ఏఈ టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

సోంపేట: కర్తలిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మదనాల ఆనంద్, లోకేష్, మల్లేన కిరణ్ తదితరులు నోటు పుస్తకాలు, పెన్నులను మంగళవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, సర్పంచ్ పొందూరు గున్నయ్య పాల్గొన్నారు.

ఒడియా ఉపాధ్యాయులను నియమించాలి

సోంపేట: మండలంలోని ఎంజీపురం పంచాయతీలో నిర్వహిస్తున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఒడియా ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ ఎస్.హరీష్‌కుమార్ అధికారులను కోరారు. తెలుగు ఉపాధ్యాయులను నియమించడంతో ఒడియా విద్యార్థులు తెలుగు మాధ్యమంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దీంతో పాఠశాల నుంచి విద్యార్థులు టీసీ తీసుకొని వెళ్లిపోతున్నారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఒడియా ఉపాధ్యాయులను నియమించాలన్నారు.

దేవీ నవరాత్రులకు పందిరిరాట



పందిరిరాట వేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: వచ్చే నెల మూడో తేదీ జరగనున్న దేవీ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా బైపల్లిలో మంగళవారం చొక్కర ధర్మారావు దంపతుల ఆధ్వర్యంలో పందిర రాట వేసే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వచ్చే నెల ఏడో తేదీన దుర్గాదేవి అమ్మవారు కొలువుదీరుతారని.. ఐదు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు దున్న పోలయ్య, ఉపాధ్యక్షులు తామాడ ఉమాపతి, కార్యదర్శి తెప్పల పాపారావు, సంయుక్త కార్యదర్శి టి.నాగరాజు, కోశాధికారి బి.శివప్రసాద్ ఉన్నారు.

ఎస్ఐకు వైఎస్సార్‌సీపీ నాయకుల అభినందన



ఎస్ఐ నిహర్‌ను అభినందిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నిహర్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలగుచ్ఛం అందజేసి అభినందించారు. ఎస్సైను కలిసిన వారిలో సీనియర్ నాయకుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైస్ ఎంపీపీ వంక రాజు, తిర్రి రాజారావు, కారి వెంకటరావు, విశ్వనాథం, జి.రామారావు, నీలాంబర్ ఉన్నారు.

గృహ నిర్మాణాలపై ఆర్డీలో సమీక్ష

కాశీబుగ్గ: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని పలాస ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు రామక్రిష్ణాపురం రెవెన్యూ పరిధిలో ఇచ్చిన రెండు వేల ఇళ్ల స్థలాల్లో నిర్మాణాల ప్రగతిపై 31 వార్డులకు చెందిన 16 మంది సచివాలయాల సెక్రటరీలతో మంగళవారం సమీక్షించారు. వార్డుల వారీగా వివరాలు ఆరాతీశారు. ఎంతమందికి స్థలాలు ఇచ్చారు, ఎంత మంది పునాదులు వేశారు, ఎంతమంది నిర్మాణాలు పూర్తి చేశారు, ఎన్ని గృహ ప్రవేశాలు జరిగాయో సేకరించాలని ఆదేశించారు.

దోమల నివారణకు సాంకేతిక సహాయం

ఇచ్ఛాపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం పట్టణంలో దోమల నివారణకు అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. కాలువలలో దోమల లార్వా నివారణ చేసేందుకు డ్రోన్ సహాయంతోమందులను పిచికారీ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కండ్ర జీవీసీ కాలనీలోని పరిసర ప్రాంతాలు, మోటార్ వెహికల్ కార్యాలయం పరిసరాల్లో ప్రైవేట్ ఏజన్సీ ద్వారా డ్రోన్‌ను ఉపయోగించి దోమల మందును మంగళవారం పిచికారీ చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, వార్డు ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

● వైద్య శిబిరం



కంచిలి మండలం గోకర్ణపురం పంచాయతీ పరిధి ఉప్పరిపేట గ్రామంలో కంచిలికి చెందిన ట్రూహ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు, ఈసీజీలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 86 మంది రోగులకు పరీక్షలు చేయగా అందులో 36 మందికి ఈసీజీ పరీక్ష నిర్వహించారు. ట్రూహ్యాండ్స్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ నర్తు కృష్ణంరాజు, జెమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు. మారుమూల గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించిన ట్రూహ్యాండ్స్ ఫౌండేషన్, జెమ్స్ ఆస్పత్రి యాజమాన్యాలకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు.

-కంచిలి

● విద్యుత్ సమస్యపై వినతి



టెక్కలి మండలం రావివలస పంచాయతీ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి అనపాన జనార్దన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖాధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. రావివలస గ్రామంలో సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ప్రధానంగా రావివలసకు ప్రత్యేక ఫీడర్, ఏబీ స్విచ్ ఏర్పాటు చేయాలని, పంచాయతీ పరిధిలోని చిన్ననారాయణపురం, దామోదరపురం గ్రామాలలో ఇళ్లపై నుంచి వెలుతున్న ఎల్‌టీ లైన్ల స్థానంలో కేబుల్ వైర్లు వేయాలని కోరారు. వినతిపత్రాన్ని విద్యుత్ శాఖ ఏఈ టి.ఈశ్వరరావుకు అందజేశారు.

- టెక్కలి రూరల్

● రూ. లక్ష విరాళం



ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కేంద్రంగా సేవా కార్యక్రమాలు అందిస్తున్న సవరదేవిపేట మృత్యుంజయ ఫౌండేషన్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా అనాథాశ్రమానికి భారీ విరాళం ప్రకటించారు. పాతపట్నం లవ్లీ చిల్డ్రన్ హోమ్‌లో చిన్నారులకు భోజనం, మిఠాయిలను మంగళవారం పంచిపెట్టారు. వారితో కలిసి కొద్దిసేపు గడిపారు. అనంతరం చిల్డ్రన్స్ హోమ్ పురోభివృద్ధికి ఫౌండేషన్ తరఫున సంఘ సభ్యులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ క్రియాశీలక సభ్యులు నీలాపు మధు, ధనలక్ష్మిలకు చిల్డ్రన్స్ హోమ్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది.

-ఇచ్ఛాపురం రూరల్

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



టెక్కలి: ఇన్‌చార్జి ఆర్డీవో కె.సుదర్శన్ దొర ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ



పలాస: రెంటికోటలో మొక్కలు నాటుతున్న దృశ్యం



నందిగాం: పెంటూరులో మొక్కలు నాటుతున్న నాయకులు, అధికారులు



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో విద్యార్థుల మానవహారం

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతతో మెలగాలన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఊరూరా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేయడం, మొక్కలు నాటడం చేపట్టారు. అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పరిశుభ్రతపై మానవహారాలు చేశారు. అక్టోబర్ రెండో తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు.

-సాక్షి నెట్‌వర్క్



కోటబొమ్మాళి: కొత్తపేటలో మొక్కలు నాటుతున్న దృశ్యం



వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో ర్యాలీ చేస్తున్న దృశ్యం



కంచిలి: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, అధికారులు



టెక్కలి: రావివలస ఎండల మల్లన్న ఆలయ ప్రాంగణంలో సీత పుష్కరిణిను శుభ్రం చేస్తున్న ప్రతినిధులు ఎస్.సుధాకర్, బి.జగదీష్ తదితరులు



కాశీబుగ్గ: ఓపెన్ జిమ్ వద్ద పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం



కవిటి: శిలగంలో చైతన్యర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సోంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



ఇచ్ఛాపురం: మైదానంలో చెత్తను తీస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాత్రలు ఇస్తున్న వైద్య సిబ్బంది



ఇచ్ఛాపురం రూరల్: శాసనాంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ బోర పుష్ప



కంచిలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది మంగళవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి ఉపాధ్యాయుల సమక్షంలో వైద్య సిబ్బంది మాత్రలను పిల్లలతో మింగించారు. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలో ఈ ప్రక్రియ జరిగింది. వైద్య శాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: ఆలయాల్లో చోరీలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ సూచించారు. ఇటీవల కాలంలో దేవాలయాలు, ఇళ్లల్లో జరుగుతున్న చోరీలను దృష్టిలో పెట్టుకుని మంగళవారం సాయంత్రం దేవాలయాల పూజారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులతో స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చోరీలు జరగకుండా ఉండాలంటే తమకు సహకరించాలని అన్నారు. విలువైన బంగారం, వెండి వంటి వస్తువులను ఆలయాల్లో ఉంచకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఎవరైన ఇళ్లకు తాళాలు వేసి వేరే ప్రాంతాలకు వెళ్లే సమయంలో ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అన్నదాతను ఆదుకోవాలి

● వైఎస్సార్‌సీపీ నాయకుల విజ్ఞప్తి



ఉప తహసీల్దార్ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్తు నరేంద్ర యాదవ్, పలువురు వైఎస్సార్ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఉప తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈక్రాప్ నమోదులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పంటల బీమాకు అవసరమైన దస్తావేజులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంటల బీమా పథకానికి సంబంధించి గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమే రైతుల పేరున ప్రీమియం చెల్లించి అందుకుందని గుర్తు చేశారు. ఇచ్ఛాపురం పట్టణంలో రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2023లో అగ్రికల్చర్ అండ్ మార్కెటింగ్ శాఖకు సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి వినతి పత్రం కూడా ఇచ్చి ఉన్నారన్నారు. మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్ల దేవరాజు, సర్పంచ్‌లు నీలాపు సారథిరెడ్డి, గుజ్జు ఢిల్లీరావు ఉన్నారు.

ప్రజాప్రతినిధులను పట్టించుకోకపోతే ఉద్యమమే

● పలాస మండల సమావేశంలో సభ్యులు హెచ్చరిక



వేదికపై ప్రజాప్రతినిధులు, అధికారులు

పలాస: ప్రజాప్రతినిధులను అధికారులు పట్టించుకోవడం లేదని, వారి ఇష్టానుసారంగా కార్యక్రమాలు చేపడుతున్నారని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండలాభివృద్ధి కార్యాలయంలో మంగళవారం జరిగింది. మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయిక్రిష్ణ మాట్లాడుతూ.. ఇటీవల అధికారులు గ్రామాల్లోకి వచ్చి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ స్వగ్రామానికి వచ్చే అధికారులు కూడా కనీసం ఆమెను కలవకుండా వారికి నచ్చిన వారిని కలిసి కార్యక్రమాలు చేపట్టడం బాధాకరమన్నారు. ఇలాగే వ్యవహరిస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమించక తప్పదన్నారు. విద్యుత్ సమస్యపై అమలకుడియా సర్పంచ్ కొర్ల శిరీష మాట్లాడుతూ.. వీరభద్రాపురంలో కరెంటు సమస్య ఉందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఏఈ బదులిస్తూ త్రిఫేజ్ లైన్ లేకపోవడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. సమస్య ఏదైనా పరిష్కరించాల్సినది విద్యుత్ శాఖ అధికారులే కదా అని సర్పంచ్ వ్యాఖ్యానించారు. ప్రత్యేక ఆహ్వానితుడు సాయిక్రిష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ గృహకల్ప పథకం కింద మంజూరైన ఇళ్లకు బిల్లులు ఇస్తారా లేదా అని ప్రశ్నించారు. అధికార పార్టీకి చెందిన వారికి ఇస్తున్నారని, అలా అయితే గృహ నిర్మాణ సంస్థ అవినీతి బండారం బయట పెడతామని హెచ్చరించారు. అన్ని ఆధారాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. బొడ్డపాడు జగనన్న కాలనీకి సంబంధించిన బిల్లులు రావడం లేదని, అసంపూర్తిగా ఉన్నాయని బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్ అన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు మాట్లాడుతూ.. మామిడిపల్లిలో రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేయడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. మరికొంత మంది సభ్యులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా సరైన సమాధానాలు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేక ఆహ్వానితుడు సాయిక్రిష్ణ మాట్లాడుతూ.. ఈ ఏడాది వంశధార శివారు భూములకు సాగునీరు అందిందని, అందుకు కృషి చేసిన అధికారులు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు, మండల ఉపాధ్యక్షులు సవర దాలమ్మ, తలగాన శ్రీరాములు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, ఇరిగేషన్ అధికారులు రాజశేఖర్, మధు, ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో విశ్వకర్మకు పూజలు



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో పూజలందుకున్న విశ్వకర్మ



నందిగాం: విశ్వకర్మకు పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణ కుటుంబాలు



కంచిలి: విశ్వకర్మ పూజల్లో భక్తులు



వజ్రపుకొత్తూరు రూరల్: రాజాంలో పూజలు అందుకుంటున్న విశ్వకర్మ



కవిటి: బొరివంకలో పూజలందుకున్న విశ్వకర్మ



కాశీబుగ్గ: చినబ్రాహ్మణవీధిలో ప్రతిష్ఠించిన విశ్వకర్మ విగ్రహం

ఇచ్ఛాపురం రూరల్: సృష్టికర్త విశ్వకర్మ జయంతి సందర్భంగా మంగళవారం మండపల్లి, తులసిగాం, బలరాంపురం గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సృష్టికి ముందే విరాట్ విశ్వకర్మ జన్మించారని, సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను సృష్టించారన్న విశ్వాసంతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నందిగాం: దేవశిల్పి విశ్వకర్మ జయంతి వేడుకల్లో భాగంగా నందిగాంలో విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. పురోహితులు మేడేపల్లి రమేష్‌శర్మ ఆధ్వర్యంలో విశ్వకర్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి విశేషపూజలు, హోమం చేశారు. మండలంలోని 35 గ్రామాల్లో ఉన్న 130 విశ్వబ్రాహ్మణ కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు.

కంచిలి: కంచిలిలో రైల్వే పీడబ్ల్యూ కారాయలయంలో విశ్వకర్మ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏడాదిపాటు కార్యాలయం పరిధిలో చేపట్టే కార్యకలాపాలన్నీ ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా జరగాలని, అధికారులు, సిబ్బంది సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని మొక్కుకున్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: సకల చరాచర సృష్టికి మూలకారకుడైన విశ్వకర్మ జయంతి సందర్భంగా వజ్రపుకొత్తూరు, రాజాం గ్రామాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. రాజాం, పల్లిసారధి గ్రామాల విశ్వబ్రహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజాంలోని పాలపోలమ్మ ఆలయంలో విరాట్ విశ్వబ్రాహ్మణ మహాయజ్ఞం నిర్వహించారు. వజ్రపుకొత్తూరులో కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధన కార్యక్రమం చేశారు.

కవిటి: బొరివంకలోని ఆచారివీధిలో విశ్వకర్మకు మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. విశ్వకర్మ విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేసి అష్టోత్తర శతనామార్చాన, సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఉద్దానానికి చెందిన ప్రముఖ కళాకారులచే ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబ్రాహ్మణవీధిలో విశ్వకర్మస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శ్రీకంచి కామాక్షి స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఏడు రోజులు పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. బవిరి గోపాలక్రిష్ణ దంపతులు తొలిపూజ చేయగా.. సంఘ అధ్యక్షులు పొట్నూరు కన్నాఆచారి, ఉపాధ్యక్షులు పొట్నూరు మురళి, కార్యదర్శి లక్కోజి శ్రీనివాసరావు, చలపాకుల మోహనరావు, లక్కోజి సంతోష్, వి.శంకరరావు, టి.శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.